లక్ష్యం.. మాయం

- తడి, పొడి చెత్త డబ్బాలు మాయమవుతున్న వైనం
- నిర్వహణను గాలికొదిలేసిన సంబంధిత అధికారులు
- పలు చోట్ల ఛిద్రమైన డబ్బాలు.. మరికొన్ని చోట్ల కనిపించని డబ్బాలు


షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో నాలాను ఆనుకుని గతంలో ఉన్న డబ్బాలు


చింతల్ ప్రధాన రోడ్డులో హెచ్ఎంటి ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన డంప్ బిన్ మాయం. రోడ్డుపై పడిన చెత్త


షాపూర్‌నగర్- గాజులరామారం చౌరస్తాలోని బస్టాప్ వద్ద ఒకటే బిన్.. మరోకటి మాయం


ప్రస్తుతం మాయమైన డబ్బాలు

రంగారెడ్డినగర్: లక్షలాది నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త డబ్బాల నిర్వహణ లోపం కారణంగా పరిశుభ్రత లక్ష్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రధాన రహదారుల వెంబడి వ్యర్థాలు, తినుబండారాలకు సంబంధించిన కవర్లను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తడి, పొడి, హానికర వ్యర్థాల సేకరణ డబ్బాలను ఏర్పాటు చేశారు.

◆ వీటిని ఐడీపీఎల్ చౌరస్తా మొదలుకుని నర్సాపూర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా సూరారం వరకు జన సామర్థ్య ప్రాంతాల్లో, బస్టాప్‌లు, మార్కెట్‌లు, షాపింగ్ మాల్స్ సమీపంలో వందల సంఖ్యలో అందుబాటులో ఉంచారు. సర్కిల్ అధికారులు ఆర్భాటంగా వాటిని ఏర్పాటు చేసినా రాను రాను వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో కొన్ని చోట్ల డబ్బాలు ఛిద్రం అయ్యాయి. మరికొన్ని చోట్ల దుండగుల చేతివాటం కారణంగా మాయమాయ్యాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కావడంతో పాటు అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.


చింతల్ బస్టాప్ వద్ద స్టాండ్ మాత్రమే మిగిలిన దృశ్యం


కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో బిన్‌లు మాయం కాగా మిగిలిన స్టాండ్

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ మల్లయ్య

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో పలు సమస్యపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుత్బుల్లాపూర్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన మూడు ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం సర్కిల్ మొత్తం వివిధ విభాగాలకు సంబంధించిన వచ్చిన 12 ఫిర్యాదులను ఉప కమిషనర్లు నరసింహ, మల్లయ్యలు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన నాలుగు ఫిర్యాదులతో పాటు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన రెండు ఫిర్యాదులు ట్యాక్స్ రూపేణా వచ్చిన సమస్యలు మూడు, ఎలక్ట్రికల్ సంబంధించిన రెండు ఫిర్యాదులను వచ్చే వారం లోపు పూర్తి చేసి పూర్తి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు.

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి తైలవర్ణ చిత్రపటం బహూకరణ


చిత్రపటాన్ని బహూకరించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు

నిజాంపేట్: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సోమవారం రాజ్‌భవన్‌లో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో ఇంద్రసేనారెడ్డిని శాలువతో సత్కరించి తైలవర్ణ చిత్రాన్ని బహూకరించారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సలహా మండలి సభ్యులు లక్ష్మీకాంతం, కష్టాది శేషు, డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన


షాపూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రంగారెడ్డినగర్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం షాపూర్‌నగర్‌లోని సాగర్ హోటల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అనేక తాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణాను అన్నపూర్ణగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారంటీల తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రాఅశోక్, పోలే శ్రీకాంత్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, రవికుమార్, ఇస్మాయిల్, అశోక్, శశి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ అభివృద్ధితో అనేక మార్పులు



బాచుపల్లిలోని వీజేఐఎం కళాశాలలో జరిగిన సదస్సులు పాల్గొన్న పలువురు వక్తలు

నిజాంపేట్: 'మానవ మేధపై కృత్రిమ మేధ పైచేయి సాధిస్తుందా'అనే అంశంపై సోమవారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎస్‌టీడీ చైర్మన్ డా. ఆనందరెడ్డి మాట్లాడుతూ.. మానవ వనరుల రంగంలో చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులను విద్యార్థులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కృత్రిమ మేధ అభివృద్ధితో నేటి సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కాని మానవ మేధను ఉపయోగించకుండా సాంకేతికను అభివృద్ధి చేయడం అసాధ్యమన్నారు. సిగ్నిటి టెక్నాలజీస్‌కు చెందిన శిరీష కొమ్మిరెడ్డి, త్రీ డిగ్రీస్ లెర్నింగ్ సొల్యూషన్స్ సీఈవో అజేస్ హుస్సేన్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులు సరైన ప్రణాళికలు రూపొందించుకుని ఎంచుకున్న మార్గంలో పయనించాలన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఇతరులకు ఉపాధి అవకాశాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. జోడాస్ ఎక్స్‌పోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ ఆనంద్ విజయ్ వర్గియా తన పుస్తకంలో ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ వైస్ చైర్మన్ డా. కె.శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ కృష్ణమోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం



జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడం గొప్ప అవకాశం అని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ పెరుమాళ్ల వెంకటలక్ష్మి అన్నారు. ఎస్ఆర్ నాయక్‌కు చెందిన టి.నాగలక్ష్మి ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. వారి కుమార్తె మైత్రేయి చెన్నైలో ఏరోనాటికల్స్ ఇంజినీరింగ్ చదువుతెంది. ఫీజు కట్టడానికి డబ్బు లేదని హార్ట్ టు హెల్ప్ ట్రస్ట్ అధ్యక్షుడు రవి నాయక్ ద్వారా వెంకటలక్ష్మి తెలుసుకున్నారు. వెంటనే ఆమె సోమవారం రూ.10వేల చెక్‌ను అందజేశారు.

సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నాం

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ


గాగిల్లాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్: స్థానిక సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. డి.పోచంపల్లిలోని 9వ వార్డులో రూ.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు పనులను కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సత్యనారాయణ ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, సాయిబాబా యాదవ్, భరత్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

◆ అదే విధంగా గాగిల్లాపూర్‌లోని 1వ వార్డులో రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులను వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ కుంటి అరుణ సోమవారం ప్రారంభించారు. మురళీయాదవ్, శ్రీనివాస్ నాయక్, అశోక్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు. మల్లంపేటలోని సాయి బాలాజీ ఎన్‌క్లేవ్‌లో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు


సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో నత్తనడకన సాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల, సుభాష్‌నగర్ డివిజన్‌ల మధ్యలో ఉన్న పైపులైన్ రోడ్డులో వారం రోజులుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఎన్‌డీపీ కింద ఎప్పుడో పూర్తి చేయాల్సిన ఈ నాలా పనులు సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకుండా తీరా ఇటీవల కాలంలో పనులు ప్రారంభించాడు. త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ కాలయాపన చేస్తూ ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ షాపూర్‌నగర్ రంగా భుజంగా థియేటర్ నుంచి జీడిమెట్ల దివాన్ దాబా వరకు ఇదే రోడ్డుపై నుంచి అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తూ జాతీయ రహదారి మీదుగా వస్తూ వెళ్తున్నారు. ఇటీవల ఇక్కడ నాలా పనులు ప్రారంభం కావడంతో జీడిమెట్ల గ్రామం మీదుగా దారి మళ్లించడంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. వారం రోజులుగా ఇక్కడ జరుగుతున్న పనులు చూస్తుంటే మరో నెల రోజులైనా పూర్తయ్యే అవకాశాలు లేవని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని వెంటనే పూర్తిచేసి ప్రజలకు వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ అల్లూరి ఫౌండేషన్ సభ్యులు


ఇన్‌స్పెక్టర్‌పుష్పగుచ్ఛం అందజేస్తున్న విప్లవజ్యోతి అల్లూరి సభ్యులు

జీడిమెట్ల: జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావును విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శాలువాతో సత్కరించారు. ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్న సీఐ అవసరం ఉన్నప్పుడు వలంటీర్‌గా పనిచేయడానికి ఆహ్వానిస్తామని అన్నారు. సీఐని కలిసిన వారిలో ఫౌండేషన్ సభ్యులు సత్తిబాబు, తాతాజీ, నాగరాజు, నరసింహ, చిన్నా, పి.నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో సత్తాచాటిన శిరీష

చింతల్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సహకారంతో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయల ఫోరం ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మొత్తం 50 పాఠశాలలకు చెందిన 90 మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో పరీక్ష రాశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌కు చెందిన శిరీష రెండో స్థానంలో నిలవగా డీఈఓ విజయ కుమారి చేతుల మీదుగా బహుమతి అందుకుంది. సోమవారం భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిరీషను పాఠశాల అధ్యాపకులు అభినందించారు.


డీఈఓ విజయకుమారి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న విద్యార్థి శిరీష

బ్రహ్మోత్సవాలను కనులపండువగా నిర్వహించాలి


బ్రహ్మోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ ఉత్సవాలను కనులపండువగా నిర్వహించాలని కార్పొరేటర్ కె.జగన్ కోరారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణమాచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ వేణుయాదవ్, ఎస్సై రంజిత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రేగురి ప్రవీణ్ కుమార్‌గుప్తా, పాపిరెడ్డి, సమ్మయ్య యాదవ్, రాము పంతులు, వెంకటేష్, రషీద్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరినగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని కార్పొరేటర్ కె.జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేకే శేఖర్ యాదవ్, చందు, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంపలబస్తీలో పీసీబీ అధికారుల తనిఖీలు

నాలాల్లో రసాయనాలు వదిలితే చర్యలు తప్పవు


గంపలబస్తీలో తనిఖీలు చేస్తున్న మేడ్చల్ జిల్లా పీసీబీ అధికారి రాజేందర్

జీడిమెట్ల: గంపలబస్తీలో రీసైక్లింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారు నాలాల్లో రసాయనాలను పారబోయవద్దని మేడ్చల్ జిల్లా పీసీబీ అధికారి రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన జీడిమెట్ల గంపల బస్తీలోని రీసైక్లింగ్ యూనిట్‌లలో తనిఖీలు చేసి సందర్శించారు. అధికారులు రావడాన్ని గమనించిన యూనిట్‌ల యజమానులు తాళాలు వేసి వెళ్లిపోయారు.

వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు తప్పవు..

వివిధ ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి డ్రమ్ములను తీసుకువచ్చి శుభ్రం చేసేవారు రసాయనాలను నాలాల్లో పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబి అధికారి రాజేందర్ అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి నోటీసులు అందజేసి యూనిట్‌లను మూసివేయిస్తామని రీసైక్లింగ్ యూనిట్‌ల యజమానులకు హుకూం జారీ చేశారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా


మాణిక్యనగర్‌లో కృతజ్ఞత యాత్రలో ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్యనగర్, మధుసూదన్ రెడ్డినగర్, ద్వారకానగర్ కాలనీల్లో మాజీ కార్పొరేటర్ గౌరీష్‌తో కలిసి ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను చేసిన అభివృద్ధితో ప్రజలు మూడోసారి పట్టం కట్టారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, సురేందర్‌రెడ్డి, నజీర్, వెంకటేష్, అజయ్, రాజు, రమణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

- తరచూ ఏదో ఒక ప్రాంతంలో వీధి కుక్కల దాడి
- ఫిర్యాదులను పట్టించుకోని సంబంధిత అధికారులు


వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలటీ పరిధి ఎన్‌సిఎల్ నార్త్ కాలనీలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నిన్న తన్విహ(5) స్కూల్‌కి వెళ్తుండగా సోమవారం రేణుక (35) సంవత్సరాలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా దాడి చేసి గాయపరిచాయి. గతంలో ఇదే కాలనీకి చెందిన దాదాపు 70 మందిని కరిచిన విషయం తెలిసిందే.

◆ వీధి కుక్కలు దాడి చేసినప్పుడు అధికారులు ఒక రోజు మాత్రమే హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో ఎన్‌సీఎల్ కాలనీలో వీధి కుక్కలు బారి నుంచి మమ్మల్ని కాపాడండి అంటూ కాలనీ వీధుల్లో పిల్లలు, తల్లిదండ్రులు ర్యాలీ కూడా చేశారు. అయినా ఫలితం లేదని బీజేపీ నేత శివాజీ రాజు అన్నారు. ఘటన జరిగినప్పుడు ఫిర్యాదు చేస్తే బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని అన్నారు. త్వరలో చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు సమాధానం ఇస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

- ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు తూతూమంత్రంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని శివాజీ రాజు కోరారు. బ్లూ క్రాస్‌తో ఒప్పందం గత సంవత్సరం జనవరి 30వ తేదీన జరిగిందన్నారు. ఈ సంవత్సర కాలంలో వీధి కుక్కల నియంత్రణకు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

చెకుముకి విజేతలకు బహుమతులు


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఏసీపీ కృష్ణ

కుత్బుల్లాపూర్: మూఢ నమ్మకాలు లేని భారత సమాజ నిర్మాణానికి నేటి విద్యార్థులు శాస్త్రీయ వైఖరులను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని సైబరాబాద్ అడ్మిన్ ఏసీపీ సీహెచ్ఎస్‌వీ కృష్ణ అన్నారు. చింతల్ సూర్యానగర్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల నాగరాజు, సీహెచ్ మల్లయ్యచారి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 60,000 మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొన్నారన్నారు. వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆనంద్ కుమార్, రాష్ట్ర నాయకులు సబితా, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ప్రారంభం


మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను సోమవారం మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి, జాతీయ ఒలింపిక్ షూటర్ ఈషా సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... అత్యాధునిక సాంకేతికతను కలిగిన కొత్త క్యాథ్ ల్యాబ్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అవసరమానమైనదని పేర్కొన్నారు. అనేక అధునాతన సాంకేతికతలను నిర్వహించడానికి అమర్చబడిన ఈ ల్యాబ్‌లో రోగులకు 3ఈ రొటేషనల్ యాంజియోగ్రఫీ ఫర్ పెర్క్యుటేనియస్ ఇంటర్వెన్షన్స్ (3డీఆర్ఏ), ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ, డైనమిక్ కరోనరీ రోడ్‌మ్యాప్, 3ఈ వెసెల్ పునర్నిర్మాణం, స్మార్ట్ వంటి సమగ్ర సేవలకు యాక్సెస్‌ను అందిస్తుందన్నారు.

విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఫోన్ నంబర్‌కు జత చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: విద్యుత్ మీటర్ ఉన్న ప్రతి ఒక్కరూ మీటర్ రీడర్ వచ్చినప్పుడు మీ సర్వీస్ నెంబర్‌కు ఫోన్ నెంబర్ కనెక్టింగ్ అయ్యే విధంగా చూసుకోవలసిన బాధ్యత ప్రతి వినియోగదారుడుపై ఉందని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు. కుత్బుల్లాపూర్ ఏడీఈ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలు సూచనలు చేస్తూ వచ్చిన అధికారులు తాజాగా ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం ఇస్తున్నారు. మీటర్ సర్వీస్ నెంబర్‌కు జత చేయడానికి వీలుగా మీటర్ రీడర్ వచ్చిన క్రమంలో మీరు లేకున్నా సంబంధిత ఫోన్ నెంబర్ రాసి సదరు చీటీని అక్కడ అంటిస్తే తప్పకుండా పరిగణలోకి తీసుకొని మీటర్ రీడర్ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తాడని పేర్కొన్నారు. ఈ విధంగా కరెంటు సరఫరాలో ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని అవకాశం ఉంటుందని తెలిపారు.

మాజీ మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎవరిని అభ్యర్థిగా నిలిపినా వారి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. దూదిమెట్ల సోమేష్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, రుద్రఅశోక్, పోలే శ్రీకాంత్, ఎత్తరి మారయ్య తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029